క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాజులూరు: ద్వారపూడి, యానం రహదారిలో కాజులూరు మండలం కుయ్యేరు వద్ద ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. యానంకు చెందిన రచ్చ రామచంద్రరావు తన బైక్‌పై ద్రాక్షరామ వెళుతున్నాడు. కుయ్యేరు వద్దకు వచ్చేసరికి రోడ్డుపై నడచి వెళ్లుతున్న ఒక వ్యక్తి అడ్డుగా రావటంతో షడన్‌బ్రేక్ వేశాడు. బైక్ పల్టీలు కొట్టడంతో రామచంద్రరావు గాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి గాయాలపాలైన అతనిని యానం ఆసుపత్రికి తరలించారు.

భాస్కరరావుకు మాజీ ఎంపీ పరామర్శ



భాస్కరరావును పరామర్శిస్తున్న మాజీ ఎంపీ రవీంద్ర

మండపేట: సతీ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు కొనగళ్ల భాస్కరరావును తన స్నేహితుడు, మాజీ ఎంపీ, కాకినాడ టౌన్‌బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర ఆదివారం పరామర్శించారు. స్థానిక గొల్లపుంతలోని భాస్కరరావు ఇంటికి వెళ్లి ఆయనను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్వర్గీయ సూర్యప్రభ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతురాలి కళ్లను దానం చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచిన కుటుంబ సభ్యులను ఆయన అభినందించారు. స్థానిక నేతలు కట్టుమేను వీర్రాజు, మోటుపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇరిగేషన్ అధికారులతో నేడు మంత్రి సమీక్ష

రామచంద్రపురం: నియోజకవర్గంలో సాగునీటి ఎద్దడిపై తీసుకోవాల్సిన చర్యల గురించి ఇరిగేషన్ అధికారులు, సాగునీటి సంఘాల అధ్యక్షులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, రైతులతో మంత్రి వాసంశెట్టి సుభాష్ సమీక్ష నిర్వహిస్తున్నట్లు మంత్రి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక లయన్స్ కల్యాణమండపంలో ఉదయం 10.30కు ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు.

అబద్ధాలతో ప్రజలను మోసగించలేరు

కాజులూరు: కూటమి నాయకులు కల్లబొల్లి మాటలు చెబుతూ అబద్ధాలతో ప్రజలను ఎల్లకాలం మోసం చేయలేరని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. మండలంలోని ఆర్యావటం బొక్కావారిపేటలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కళా సత్యవతి కుటుంబ సభ్యులను ఆదివారం సూర్యప్రకాష్ తదితర నాయకులు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో ఆయన కార్యకర్తలను కలుసుకుని ప్రజాసమస్యలపై చర్చించారు. ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ ఎన్నికల్లో సూపర్‌సిక్స్ పేరుతో తప్పుడు వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన తెలుగుదేశం నాయకులు వాటిని అమలు చేయలేక అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, స్థానిక ఎంపీటీసీ రాయుడు ఈశ్వరి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కురుపూడి సూర్యనారాయణ, పార్టీ నాయకులు పాలిక వీరబాబు, వనుం పెద్ద తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీధర్



ఏడీఈ శ్రీధర్‌ను సత్కరిస్తున్న నేతలు

మండపేట: స్థానిక విద్యుత్‌శాఖలో ఏడీఈగా పని చేస్తున్న చొల్లంగి శ్రీధర్ బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. దీంతో స్థానిక శెట్టి బలిజ కల్యాణ మండపంలో ఆయనను శెట్టిబలిజ సంఘం నేతలు శాలువా, పూలమాలతో సత్కరించారు. సంఘ అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, నాయకులు మట్టపర్తి గోవిందరాజు, కుక్కల రామారావు తదితరులు పాల్గొన్నారు. మండపేట, ఏడిద సబ్‌స్టేషన్ పరిధిలో పనిచేసే విద్యుత్ ఉద్యోగులు ఆయన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఏఈ మునిం, జేఈ సత్యనారాయణ, 327 యూనియన్ నాయకులు పీఎస్ఎస్ వెంకటేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి రాజ్‌కుమార్ విద్యుత్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు రామలింగేశ్వరుని కల్యాణం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయానికి ఉత్తర దిక్కున ఉన్న పర్వత వర్ధినీ సమేత సప్తకోటి రామలింగేశ్వరస్వామి కల్యాణ వేడుక నేటి రాత్రి 7 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికే చెందిన శేఖ్ దినేష్ దంపతుల చేతుల మీదుగా జరుగనున్న కల్యాణ వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై కూటమి కత్తి

- చిరుద్యోగులపై కక్ష సాధింపు
- ఫిర్యాదుల పేరుతో తొలగింపులు
- తమ వారి కోసం బలవంతపు రాజీనామాలు
- ఇప్పటికే 10 మంది తొలగింపు



విధుల్లోకి తీసుకోవాలని ధర్నా చేస్తున్న ఆర్యావటం ఫీల్డ్ అసిస్టెంట్ వీరవెంకటలక్ష్మి (ఫైల్)

రామచంద్రపురం: నియోజకవర్గంలో ఎంతో కాలంగా ఫీల్డ్ అసిస్టెంట్లుగా చేస్తున్న వారిపై కూటమి నాయకులు కన్నుపడింది. చిన్న చిన్న కారణాలు చూపిస్తూ ఫీల్డ్ అసిస్టెంట్లపై బెదిరింపులకు పాల్పడుతున్న వైనం నియోజకవర్గంలో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. నియోజకవర్గంలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా జరుగుతున్న ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌ను వినియోగించుకుని తద్వారా లేని తప్పులను చూపిస్తూ ఫిర్యాదులు చేస్తూ చిరుద్యోగులైన ఫీల్డ్ అసిస్టెంట్ల పొట్టకొట్టే పనులకు గ్రామ స్థాయి, మండల స్థాయి కూటమి నేతలు చేస్తున్న దుర్మార్గ పనులపై నియోజకవర్గ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. గ్రామ స్థాయిలో తమ తమ రాజకీయాలకు ఫీల్డ్ అసిస్టెంట్లను బలిచేయడం ఎంత వరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురం మండలంలోని గ్రామాల్లో ఉపాధి పనులకు సంబంధించి ప్రతీ మండలంలోని 22 నుంచి 25 మంది వరకు ఫీల్డ్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తున్నారు. ఉపాధి హామీ పథకం అమలైన ఏడాది నుంచి అంటే సుమారుగా 21 ఏళ్లుగా కొంతమంది విధులు నిర్వహిస్తుండగా మరికొంత మంది 10 నుంచి 15 ఏళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎవరు ఎలా ఉన్నా రాజకీయ ఒత్తిళ్లు లేకుండా ఫీల్డ్ అసిస్టెంట్లు తమ పనులు తాము నిర్వహించుకునే వారు. కానీ పది నెలల క్రితం ఏర్పడిన కూటమి ప్రభుత్వంతో ఫీల్డ్ అసిస్టెంట్లకు కష్టాలు ప్రారంభమయ్యాయి. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా పనిచేశారంటూ నిందలు వేస్తూ తమ వారిని నియమించుకునేందుకు ఇప్పటివరకు ఆయా గ్రామాల్లో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను అకారణంగా తొలగించి తమ వారికి కట్టబెట్టే దుర్మార్గపు చర్యలకు కూటమి నాయకులు తెరతీశారు. కూటమి నాయకుల ఒత్తిళ్ల కారణంగా నియోజకవర్గంలో ఇప్పటికే కె.గంగవరం మండలంలో ఒకరు, రామచంద్రపురం మండలంలో ఒకరు, కాజులూరు మంలంలో ఇద్దరు బలవంతంగా రాజీనామాలు చేసి తొలగిపోగా రామచంద్రపురం మండలంలో ఏడుగురు, కె.గంగవరం మండలంలో ఐదుగురు ఫీల్డ్ అసిస్టెంట్లను పొమ్మనకుండా పొగబెట్టే యత్నాలు చేస్తున్నారు. కాజులూరు మండలం ఆర్యావటం ఫీల్డ్ అసిస్టెంట్ మాతాబత్తుల వీరవెంకటలక్ష్మిని సోషల్ ఆడిట్‌లో తేడాలున్నాయని కారణంగా చూపుతూ తొలగించారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ వీరవెంకట లక్ష్మి కోర్టును ఆశ్రయించగా కోర్టు విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. దీంతో అధికారులు వెంటలక్ష్మిని విధుల్లోకి తీసుకోగా తిరిగి వారం తిరక్కుండానే కూటమి నాయకుల ఒత్తిళ్లతో మళ్లీ విధుల నుంచి తొలగించారు. దీనిపై ఆమె తమకు న్యాయం చేయాలని ధర్నా చేసి పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయింది. అంతేకాకుండా కాజులూరు మండలంలో మరో నలుగురిపై అకారణంగా వేటు వేసేందుకు కూటమి నాయకులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తుంది. ఇలా సోషల్ ఆడిట్‌లో వచ్చిన చిన్న చిన్న లోపాలను పెద్దవిగా చూపిస్తూ 20 ఏళ్లుగా ఎటువంటి ఫిర్యాదులు లేకుండా పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్లపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం పలు విమర్శలకు తావిస్తుంది. గ్రామ మండల స్థాయిలో జరుగుతున్న ఈ తతంగం స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సుభాష్‌కు తెలియకుండానే జరుగుతుందా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా అంతా తానై వ్యవహరిస్తున్న మంత్రి సుభాష్ తండ్రి సత్యం కనుసన్నల్లోనే గ్రామ మండల స్థాయి నాయకులు ఈ వ్యవహారాలకు తెరతీస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. కూటమి నాయకులు చిరుద్యోగులపై రాజకీయలు చేయకూడదని, ఫీల్డ్ అసిస్టెంట్లను అకారణంగా తొలగించి పొట్టకొట్టవద్దని, రాజకీయాలకు బలి చేయవద్దని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

సోమేశ్వరుని తాకిన సూర్యకిరణాలు



సూర్యకిరణాల కాంతిలో మెరిసిపోతున్న బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి

రాయవరం: బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామిని ఆదివారం సూర్యకిరణాలు తాకాయి. సాయంత్రం సమయంలో భానుడి కిరణాలు స్వామివారి పాదాల నుంచి ప్రారంభమై శిరస్సు వరకూ ప్రసరించాయి. సంధ్యా సమయంలో భానుడి బంగారు కిరణాల వెలుతురులో స్వామి వారు, అమ్మవార్ల విగ్రహాలు మెరిసిపోయాయి. ఏటా పాల్గుణ మాసంలో భానుడి కిరణాలు స్వామి వారిని తాకుతాయి. దీనిలో భాగంగా స్వామివారిని సూర్యకరణాలు తాకడాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన భక్తులు మురిసిపోయారు. భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్యేశ్వరశర్మ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఏటా అక్టోబరు, ఏప్రిల్ నెలల్లో సూర్య కిరణాలు స్వామివారిని, అమ్మవారిని తాకుతాయని అర్చకుడు పరిటాల శివ తెలిపారు.

నూరుశాతం పన్నుల వసూలే లక్ష్యం

- సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- మున్సిపల్ కమిషనర్ రంగారావు హెచ్చరిక



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ రంగారావు

మండపేట: పురపాలక సంఘానికి వివిధ రూపాల్లో రావాల్సిన ఆస్తి పన్నులు నూరుశాతం వసూళ్లే లక్ష్యంగా సచివాలయ, కార్యాలయ సిబ్బంది పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు సూచించారు. మున్సిపాలిటీ ఆదాయం పెంచేందుకు కమిషనర్ రంగారావు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వాస్తవానికి ప్రభుత్వ ఉద్యోగులకు ఆదివారం సెలవు. అయినప్పటికీ పురపాలక సంఘానికి ప్రధాన ఆదాయ వనరుగా వున్న ఇంటి పన్నులు వసూలు చేయాలన్న సంకల్పంతో కార్యాలయ అధికారులు, సచివాలయ సిబ్బందికి అయన కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సెలవురోజున కూడా వారి విధులకు ఆదేశాలిచ్చారు. ఈ నెలాఖరుకు నూరుశాతం లక్ష్యాన్ని అధిగమించాలన్నారు.

సిబ్బందితో సమీక్ష

మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రంగారావు మాట్లాడుతూ పన్ను వసూళ్ల విషయంలో రాజీ పడకుండా పనిచేయాలన్నారు. మొండి బకాయిలను వసూలు చేయాలని ఆదేశించారు. సిబ్బంది నిర్లక్ష్యం వహించినా, వసూళ్లలో పురోగతి కనిపించకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంటిపన్నులు, కుళాయి పన్నులు, ఖాళీస్థలం పన్నులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న వారితో తప్పనిసరిగా కట్టించాలని ఆదేశాలిచ్చారు. ఎవరెవరు ఎంత కట్టించారో తనకు చెప్పాలన్నారు. నూరుశాతం పన్నులు వసూలు చేసిన మున్సిపాలిటీకి 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు అదనంగా వస్తాయన్నారు. ప్రభుత్వం నుంచి అదనపు నిధులు వస్తే పట్టణాన్ని మరింత అభివృద్ధి పరచడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా ఆస్తిపన్నులు చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. 2024– 25 ఆర్థిక సంవత్సరానికి గాను మొత్తం రూ.10.59 కోట్లు రావాల్సి ఉండగా, ఇప్పటివరకూ 6. 40 కోట్లు వసూలు చేసినట్టు ఆయన తెలిపారు. సమావేశంలో డీఈ కె.శ్రీనివాస్, ఆర్వో జేవీఎస్ శాస్త్రి, ఆర్ఐలు ఏజేఎస్ శ్రీనివాస్, ఉప్పల శ్రీనివాస్, ఏఈలు పవన్‌కుమార్, బి.ఆంజనేయులు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం షాపు ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన



దీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు

మండపేట: ఇళ్ల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయవద్దని స్థానికులు ఆందోళన చేశారు. ప్రభుత్వ మద్యం పాలసీలో కల్లుగీత కార్మికుల కోటాలో మద్యం షాపు దక్కింది. జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతంలో షాపు పెడితే మూడుపువ్వులు ఆరు కాయలుగా వ్యాపారం సాగుతుందన్న దురాలోచనతో సదరు పాటదారుడు 28, 29 వార్డుల్లోని సప్తగిరి థియేటర్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని ఎంచుకుని షెడ్డు నిర్మాణం చేపట్టాడు. తొలుత ఇదే షాపును తాత్కాలికంగా అదే రోడ్డులో మరోచోట ఏర్పాటు చేయాలని చూడగా ఆదిలోనే స్థానికులు దానికి అడ్డుకట్ట వేశారు. ఎక్సైజ్ అధికారులు తాత్కాలిక షాపును తీయించి వేశారు. వారం తర్వాత సదరు పాటదారుడు అనువైన ఖాళీ స్థలంలో శాశ్వతంగా షాపు ఏర్పాటుకు సన్నాహాలు మొదలుపెట్టాడు. దీనిపై రెండు వార్డుల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇళ్ల మధ్య షాపు వద్దని శాంతియుతంగా చెప్పినా స్పందించక పోవడంతో మహిళలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రెండో రోజు ఆదివారం చేపట్టిన దీక్షల్లో మహిళలతో పాటు పాఠశాల విద్యార్థులు పాల్గొనడం గమనార్హం. సాయంత్రం రాజారత్న జంక్షన్ వైఎస్సార్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని మద్యం షాపు ఏర్పాటుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు.

సేవామూర్తి సుబ్బారావుకు సత్కారం



కుటుంబ సభ్యులతో డాక్టర్ సుబ్బారావు

కపిలేశ్వరపురం: అమెరికాలో దీర్ఘకాలం వైద్యసేవలు అందించిన మండలంలోని అంగర గ్రామానికి చెందిన డాక్టర్ బలుసు సుబ్బారావును అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలు ఆదివారం సన్మానించారు. దీర్ఘకాలం తర్వాత వంద సంవత్సరాల వయస్సులో సుబ్బారావు సొంతూరు అంగరకు వచ్చారు. అమెరికాలో ఉన్న కాలంలోనే అంగర, పడమర ఖండ్రిక గ్రామాల విద్యావ్యాప్తి కోసం జెడ్పీ ఉన్నత పాఠశాల భవన నిర్మాణం చేపట్టారు. ఇటీవల కాలంలో రూ.75 లక్షలతో అంగర పీహెచ్‌సీ ఆవరణలో నూతన బ్లాక్ నిర్మాణం తదితర సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఆ అభిమానంతో ఇరు గ్రామాల ప్రజలు పౌరసన్మానం చేశారు. గ్రామ శివారు నుంచి ఉన్నత పాఠశాల మైదానం వరకూ మేళతాళాలతో ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆసుపత్రిలో నెలకొల్పిన భార్య వసుంధర విగ్రహానికి సుబ్బారావు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల మైదానంలో ఇరు గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, యువజన, విద్యార్థి సంఘాల ప్రముఖులు సుబ్బారావును సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంతూరుపై మమకారంతో రూ. కోట్లతో విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, ఇతర సామాజిక సదుపాయాల కల్పనకు ఆర్థిక సాయం చేయడం పట్ల సుబ్బారావును కొనియాడారు. సన్మాన గ్రహీత సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువు ప్రాధాన్యాన్ని గుర్తించాలన్నారు. రానున్న రోజుల్లో సైతం సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానన్నారు. ఇరు గ్రామల పెద్దలను ఆప్యాయతగా పలకరించారు. ఆయన కుటుంబ సభ్యులతో సందడిగా గడిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జున చౌదరి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ రెడ్డి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, పెద్దిరెడ్డి శేషారత్నం, అడ్డాల శ్రీనివాస్, ఇరు గ్రామాల నాయకులు బలుసు జానకిరామయ్య, పుత్సల శ్రీనివాస్, తిరునాతి వెంకటేశ్వరరావు, పిల్లా బసవరాజు, యర్రా వీరన్నబాబు, జిత్తుక మల్లికార్జునుడు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘననివాళి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రామచంద్రపురం: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ వర్ధంతిని పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పి.రాము, సీఐటీయూ నాయకులు ఎస్.బలరాం, ప్రజానాట్యమండలి నాయకులు ఎం.ప్రేమానందం, ఆటో యూనియన్ నాయకులు పి.బాపిరాజు, యు.బాలు, జి.రాంబాబు, ఉప్పాడ రాంబాబు, బి.కాశి, ఎస్.సోమిరెడ్డి, కార్మికులు పాల్గొని భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శెట్టిబలిజల ఆరాధ్య దైవం 'వెంకటరెడ్డి'



దుగ్గుదుర్రులో దొమ్మేటి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్



తాళ్లపాలంలో కట్టా సూర్యనారాయణను సత్కరిస్తున్న నాయకులు



దొమ్మేటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శెట్టిబలిజ సంఘం నేతలు

కాజులూరు: శెట్టిబలిజ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దొమ్మేటి వెంకటరెడ్డి శెట్టిబలిజలకు ఆరాధ్య దైవమని ఆయన ఆశయాలను యువకులు ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం కాజులూరు మండల గ్రామాల్లో దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి పురస్కరించుకుని శెట్టిబలిజ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని బీసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. దుగ్గుదుర్రు శివారు పాటిగరువులో జరిగిన కార్యక్రమాల్లో మంత్రి సుభాష్ పాల్గొని ముందుగా దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆనాటి కాలంలోనే కోనసీమ నుంచి బర్మా దేశం రంగూన్‌కు వ్యాపారాలకు వెళ్లి అక్కడ మేయర్ పదవి చేపట్టిన వెంకటరెడ్డి కోనసీమ శెట్టిబలిజల సంక్షేమానికి ఎనలేని కృషి చేశారన్నారు. వయోజన విద్యను ప్రోత్సహించటంతో పాటు ఎన్నో పాథమిక పాఠశాలు, గ్రంథాలయాలు, రాత్రి పాఠశాలలు నెలకొల్పి విద్యాదాతగా పేరొందారన్నారు. అదే విధంగా దుగ్గుదుర్రు చెరవుగట్టు సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో అమలాపురం పార్లమెంట్ శెట్టిబలిజ సంక్షేమ సంఘం కన్వీనర్ కడలి రాంపండు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ తదితరులు పాల్గొని దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాలలో పలువురు బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

తాళ్లపాలంలో..

రామచంద్రపురం రూరల్: శెట్టిబలిజ సంఘ వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి పురస్కరించుకుని మండలంలోని తాళ్లపాలంలో మాజీ ఎంపీపీ కట్టా సూర్యనారాయణ ఇంటి వద్ద ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వక్తలు దొమ్మేటి వెంకటరెడ్డి సేవలను కొనియాడారు. వెంకటరెడ్డి బాటలో శెట్టిబలిజ సంఘానికి రామచంద్రపురం నియోజకవర్గంలో దశాబ్దాలుగా ఎనలేని సేవలు అందిస్తున్న కట్టా సూర్యనారాయణను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, తాళ్లపాలం సర్పంచ్ కట్టా గోవిందు, బీజేపీ నాయకుడు టేకుమూడి సత్యనారాయణ, బీసీ నాయకుడు కడలి రాంపండు తదితరులు పాల్గొన్నారు.

'దొమ్మేటి'ని ఆదర్శంగా తీసుకోవాలి

మండపేట: సంఘ సంస్కర్త, విద్యాదాత దొమ్మేటి వెంకటరెడ్డిని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని శెట్టిబలిజ సంఘ పట్టణ అధ్యక్షుడు పంపన శ్రీనివాస్ పేర్కొన్నారు. దొమ్మేటి 172వ జయంతిని ఆదివారం మండపేటలో శెట్టిబలిజలు ఘనంగా నిర్వహించారు. శెట్టిబలిజ కల్యాణ మండపంలో సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో దొమ్మేటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ శెట్టిబలిజల ఔన్నత్యానికి ఎనలేని కృషి చేసిన దొమ్మేటిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. బడుగు, బలహీన వర్గాల పిల్లలకు పాఠశాల వద్దే భోజనం ఏర్పాట్లు చేసి విద్యను అందించిన విద్యాదాత దొమ్మేటి అని కొనియాడారు. కార్యక్రమంలో కుక్కల రామారావు, చింతపల్లి రామకృష్ణ, మట్టపర్తి గోవిందరాజు, పెంకే గంగాధర్, పిల్లి శ్రీనివాస్, సూరంపూడి సత్యప్రసాద్, యాండ్ర ప్రబాకరరావు(బుజ్జి) పాల్గొన్నారు.



నల్లూరులో దొమ్మేటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దొమ్మేటి ఆశయ సాధనకు కృషి చేయాలి

కపిలేశ్వరపురం: సామాజిక వేత్త దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు వక్తలు అన్నారు. నల్లూరులో సీతారామ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దొమ్మేటి 172వ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శెట్టి బలిజల అభ్యున్నతికి దొమ్మేటి వెంకటరెడ్డి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

అలరించిన శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రంలో శనివారం రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా అలరించింది. ప్రతిరోజూ ముఖ్యంగా ప్రతి శనివారం రాష్ట్ర నలుమూలల నుంచి అశేష సంఖ్యలో భక్తులు తరలి వస్తుండగా మిగిలిన ఆరు రోజులు కూడా అత్యధికంగా భక్తజనం తరలివచ్చి స్వామిని దర్శించుకుంటున్నారు. 'ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం' నానుడితో అశేష భక్తజనం తరలి రావడంతో కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందింది. ఏడు వారాల నోము పూర్తి చేసుకున్న భక్తులు ప్రతిరోజు అష్టోత్తర పూజలు జరిపిస్తున్నారు. తిరుమలలో మాదిరిగా ఆలయ ప్రాంగణంలో ధర్మపథం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా శనివారం రాత్రి రాజమహేంద్రవరానికి చెందిన యజ్ఞశ్రీ నృత్యనికేతన్ వారితో శ్రీనివాస కల్యాణం కూచిపూడి నృత్య రూపకం భక్తులను విశేషంగా అలరించింది.